ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 337 | పేజీలు: 6 | వెల: రూ.3/- | మంగళవారం 17 మార్చి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ

## ఆవిష్కరించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

## కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్, మల్లు భట్టి, పలువురు మంత్రులు

## ఈ విగ్రహం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి నిదర్శనమన్న రేవంత్



**హైదరాబాద్, మార్చి 16 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ శాసనసభ ఆవరణలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర గౌరవానికి, సంస్కృతికి ప్రతీకగా నూతనంగా ఏర్పాటు చేసిన 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఈ విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో ప్రతిష్టించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ముందు గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర నేతలు అసెంబ్లీ ఆవరణలోని మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద ఘనంగా నివాళులర్పించారు. దేశానికి వారు అందించిన గొప్ప సేవలను స్మరించుకున్నారు. విగ్రహావిష్కరణ అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఈ తెలంగాణ తల్లి విగ్రహం కేవలం ఒక రూపం మాత్రమే కాదని, ఇది కోట్లాది మంది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, పోరాట స్ఫూర్తికి నిదర్శనమని పేర్కొన్నారు.

## హైడ్రా ద్వారా రూ.60 వేల కోట్ల

# ప్రభుత్వ ఆస్తులను కాపాడాం

## తెలంగాణ గవర్నర్

### విజన్ 2047 ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్ మ్యాప్ రూపొందించామన్న గవర్నర్

### రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరిందని ప్రకటన

### మహాలక్ష్మి పథకంతో రూ.9,222 కోట్లు ఆదా అయ్యాయని వెల్లడి



**హైదరాబాద్, మార్చి 16 (ప్రభాత ఉదయం)**

హైడ్రా ద్వారా రూ.60 వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడామని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. శ్రమించేతత్వం కలిగిన తెలంగాణ ప్రజలందరికీ శుభాకాంక్షలు అని ఆయన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రజాకేంద్రీకృత పాలన ప్రభుత్వం విధానమని అన్నారు. విజన్ 2047 ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్ మ్యాప్ రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరుకుందని తెలిపారు. క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ ద్వారా రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. పట్టణాభివృద్ధికి క్యూర్ మోడల్‌ను అనుసరిస్తున్నామని అన్నారు. 2031 నాటికి పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుకుంటుందని అంచనాలు ఉన్నట్లు తెలిపారు. ప్రతి పౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా రాష్ట్ర బడ్జెట్ ఉంటుందని గవర్నర్ తెలిపారు. ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. జీహెచ్ఎంసీని ఇటీవల మూడు కార్పొరేషన్లుగా, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని 4 కమిషనరేట్లుగా విభజించినట్లు తెలిపారు. బయో ఆసియా సదస్సు ద్వారా రాష్ట్రానికి రూ.1,700 కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ గమ్యస్థానంగా

..మిగతా 2లో



## ఈనెల 30 వరకు

# బడ్జెట్ సమావేశాలు

### నేడు ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు

### ఈ నెల 19న ఉగాది సందర్భంగా సభకు సెలవు

### మార్చి 20న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న మల్లు భట్టి

**హైదరాబాద్, మార్చి 16 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు నేడు ప్రారంభమయ్యాయి. గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత సభ రేపటికి వాయిదా పడింది. అనంతరం జరిగిన బీఏసీ సమావేశంలో బడ్జెట్ సమావేశాలను ఈ నెల 30 వరకు కొనసాగించాలని నిర్ణయించారు. రేపు, ఎల్లుండి గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం, చర్చ ఉంటుంది. ఈ నెల 19న ఉగాది పండుగ సందర్భంగా సభకు సెలవు ఉంటుంది. మార్చి 20న డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఈ సమావేశాలు కేవలం బడ్జెట్‌కే పరిమితం కాకుండా, రాజకీయంగా కూడా వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆరు గ్యారంటీల అమలు, రైతు భరోసా, మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టు, హైదరాబాద్ మెట్రో విస్తరణ వంటి అంశాలపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉంది.



## దేశంలో వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్

# కొరత లేదు

2లో..

## కేంద్ర ప్రభుత్వం ప్రకటన

### అన్ని రాష్ట్రాలలో ఎల్పీజీ స్టాక్ ఉందన్న కేంద్ర ప్రభుత్వం

### గృహ వినియోగదారుల కోసం 100 శాతం స్టాక్ ఉందన్న కేంద్రం

### హార్మూజ్ జలసంధి వద్ద భారత నౌకలు క్షేమంగా ఉన్నాయని వెల్లడి

## కెసిఆర్ హయాంలో విపక్షానికి

# మాట్లాడే సమయం ఇవ్వలేదు



### సమావేశాల్లో ఎమ్మెల్యేలు హాజరు కావాల్సిందే

### అన్ని సమస్యలపై అవగాహనతో సిద్ధం కావాలి

### ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలతో సిద్ధంగా ఉండాలి

### సిఎల్పీ సమావేశానికి కొందరు డుమ్మాపై సీరియస్

### గవర్నర్ ప్రసంగం మనకు రోడ్ మ్యాప్ లాంటిది

### సిఎల్‌పి సమావేశంలో సిఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మార్చి 16 (ప్రభాత ఉదయం)**

శాసనసభ సమావేశాలకు సభ్యులంతా తప్పని సరిగా హాజరు కావాలని పార్టీ ఎమ్మెల్యేలను తెలం గాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వివి ధ అంశాలపై ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవా లని, వారికి మంత్రులు సమయమివ్వాలని సూచిం చారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సీఎల్పీ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై సమాధానం ఇచ్చేందుకు పూర్తి సమాచారం దగ్గర ఉంచుకోవాలన్నారు. ఏదో ఒక సాకుతో సభ్యులు సభకు గైర్హాజరు కావొద్దన్నారు. సీఎల్పీకి పలువురు ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంపై సీఎం సీరియస్ అయ్యారు. సీఎల్పీకి

..మిగతా 2లో

# 11 సీట్లకు రాజ్యసభ ఓటింగ్

## ఏకగ్రీవంగా 26 మంది అభ్యర్థుల గెలుపు

**హైదరాబాద్, మార్చి 16 (ప్రభాత ఉదయం)**

ఖాళీగా ఉన్న రాజ్యసభ సీట్ల కోసం ఎన్నికలు జరుగుతున్నాయి. సాయంత్రం 5 గంటలకు కౌంటింగ్ జరగనున్నది. అయితే 10 రాష్ట్రాల్లో మొత్తం 37 సీట్లకు రాజ్యసభ ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ ఇప్పటికే 26 అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే కొత్త సభ్యుల కోసం కేవలం 11 సీట్లకు మాత్రమే ఓటింగ్ జరుగుతోంది. బీహార్, హర్యానా, ఒడిశా రాష్ట్రాల్లో ప్రస్తుతం ఓటింగ్ కొనసాగుతోంది. బీహార్‌లో అయిదుగురు, ఒడిశాలో నలుగురు, హర్యానాలో రెండు సీట్ల కోసం ఎన్నిక జరుగుతోంది. ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థుల్లో ఏడుగురు బీజేపీ, అయిదుగురు కాంగ్రెస్, టీఎంసీ నలుగురు, డీఎంకే నుంచి ముగ్గురు ఉన్నారు. శివసే, ఆర్పీఐ, ఎన్సీ, ఎన్సీపీ ఎస్పీ, అన్నాడీఎంకే, యూపీపీఎల్ పార్టీల నుంచి ఒక్కొక్కరు నెగ్గారు. రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రముఖుల్లో శరద్ పవార్, అభిషేక్ సింఘ్వీ, తిరుచ్చి శివ, వినోద్ తవడే ఉన్నారు. అయితే బీహార్ నుంచి ఆ రాష్ట్ర సీఎం నితీశ్ కుమార్ కూడా రాజ్యసభ ఎన్నికల్లో పోటీపడుతున్నారు. తమిళనాడు నుంచి ఆరుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుచ్చి శివ, తందిదురై ఆ జాబితాలో ఉన్నారు.



# కెసిఆర్ హయాంలో విపక్షానికి మాట్లాడే సమయం ఇవ్వలేదు

**మొదటి పేజీ తరువాయి...**

రాలేనంత బిజీగా ఉన్నారా అని ప్రశ్నించారు. మీడియాతో చిట్‌చాట్‌లు చేయవద్దన్నారు. ప్రజా ప్రభుత్వంలో మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ప్రాధాన్యం, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా తన ప్రసంగంలో వివరించారని తెలిపారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లాంటిదని చెపకొచ్చారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం అయిపోయిందని అన్నారు. ప్రభుత్వ భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నామనే విషయంపై దృష్టి సారించాలని సూచించారు. సభలో మాట్లాడే అంశాలపై ప్రభుత్వ విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. సభలో చర్చ పక్కదారి పట్టకుండా, సభా సమయం వృథా కాకుండా సమర్థవంతంగా నడిపేలా చూడాలని దిశానిర్దేశర చేశారు. కేసీఆర్ హయాంలో.. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడటానికి తమకు సమయం ఇవ్వలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. సీఎల్పీ నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్కకు, జానారెడ్డికి కూడా మైక ఇవ్వలేదని ఆగ్రహించారు. సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు తనను సభకు రాకుండా చేశారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించొద్దని హుకుం జారీ చేశారు. మహిళా శాసన సభ్యులు హాజరుతో పాటు చర్చల్లో పాల్గొనాలని మార్గనిర్దేశర చేశారు. సభా చర్చల్లో మహిళా సభ్యుల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఇది మన ప్రభుత్వం.. ఇపడు మనం వేసుకునే రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికలకు అజెండా అవుతుందని అన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. 99 రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాల్లో పర్యటించి పలు సమస్యలు, ఆయా ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు. రాజకీయాల్లో వ్యక్తిగత డ్యామేజీ ఉండదని.. ఆది వ్యవస్థ మొత్తాన్ని డ్యామేజ్ చేస్తోందని అన్నారు. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలని సూచించారు.

# ఐసియులో చెలరేగిన మంటలు... పదిమంది రోగుల దుర్మరణం

## కటక్ ఆస్పత్రిలో దారుణం

**భువనేశ్వర్, మార్చి 16 (ప్రభాత ఉదయం)**

ఒడిషాలోని కటక్ ఆస్పత్రి ఐసీయూలో అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో రోగులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. రోగులను ఐసీయూ నుంచి బయటికి తీసుకువెళ్లే క్రమంలో పలువురు సిబ్బందికి కూడా కాలిన గాయాలయ్యాయి. ఒడిశాలోని కటక్ సిటీ లోగల ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కటక్‌లోని ఎస్‌సీబీ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆస్పత్రి ట్రామా కేర్ విభాగం ఐసీయూలో ఆదివారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 10 మంది రోగులు దుర్మరణం పాలయ్యారు. మరో 11 మందికి గాయాలయ్యాయి. ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు సీఎం ప్రకటించారు. అదేవిధంగా ఈ అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణకు



ఆదేశించారు. ఈ తెల్లవారుజామున 2.30 నుంచి 3.00 గంటల మధ్య సమయంలో ప్రమాదం జరిగిందని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. మంటలు చెలరేగగానే తాము రోగులను ఐసీయూ నుంచి బయటికి తీసుకొచ్చే ప్రయత్నాలు చేశామని తెలిపారు. ఘటన సమయంలో ఐసీయూలో ఆ పక్కన ఉన్న వార్డులో మొత్తం 23 మంది రోగులు చికిత్స పొందుతున్నారని, వారిని తరలిస్తుండగా అప్పటికే ఏడుగురు రోగులు ప్రాణాలు కోల్పోయారని, మరో ముగ్గురు తరలించే క్రమంలో మృతిచెందారిని ఐసీయూ సిబ్బంది వెల్లడించారు. ఐసీయూ నుంచి రోగులను తరలించే క్రమంలో సిబ్బందిలో కూడా 11 మంది గాయపడ్డారని తెలిపారు.



## దేశంలో వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్

# కొరత లేదు

**హైదరాబాద్, మార్చి 16 (ప్రభాత ఉదయం)**

వంటగ్యాస్ కొరత ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు 100 శాతం ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. అన్ని రాష్ట్రాల్లోనూ ఎల్పీజీ స్టాక్ గృహావసరాలకు సరిపోయేంత ఉందని తెలిపింది. పెట్రోల్, డీజిల్ కూడా తగినంత అందుబాటులో ఉందని కేంద్రం తెలిపింది. అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. పెట్రోల్, డీజిల్ కొరత లేదని స్పష్టం చేసింది. పర్షియన్ గల్ఫ్ నుంచి బయలుదేరిన శివాలిక్ ఎల్పీజీ క్యారియర్ హర్మూజ్ జలసంధిని దాటి భారతదేశం సమీపానికి చేరుకుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. పశ్చిమాసియా ప్రాంతంలోని అన్ని భారత నౌకలు సురక్షితంగా ఉన్నాయని తెలిపింది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. ప్రతి నౌకలోని సిబ్బందితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించింది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 611 మందితో కూడిన 22 భారతీయ జెండా కలిగిన నౌకలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.



## ఆరు గ్యారెంటీలపై

# అసెంబ్లీలో నిలదీస్తాం

### గన్‌పార్క్ వద్ద అమరులకు కెటిఆర్ తదితరుల నివాళి

**హైదరాబాద్, మార్చి 16 (ప్రభాత ఉదయం)**

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఠంచనుగా పడేదని గుర్తుచేశారు. అదే కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నా రైతుబంధు దిక్కులేదని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. శాసనసభ సమావేశాలకు ముందు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించామని తెలిపారు. అమరవీరుల స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ, వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రెండున్నరేళ్లవుతున్నా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. ఆనాడు గవర్నర్‌తో చట్టబద్ధత కల్పిస్తామని చెప్పించారని తెలిపారు. పంటల వేసే నాటికి కేసీఆర్ రైతుబంధు నిధులు వేసేవారని కేటీఆర్ గుర్తుచేశారు. రాహుల్ బంధు కాదు.. రైతుబంధు వేయాలని కోరారు. రైతులకు వెన్నుపోటు.. రాహుల్‌కు వెయ్యి కోట్లా అని నిలదీస్తామని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాల ఊసే లేదని.. రైతుబంధుకు దిక్కే లేదని విమర్శించారు. వృద్ధులు పింఛన్లు, రైతులు, రైతు కూలీలు రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. జాబ్ క్యాలెండర్‌లో ఉత్త క్యాలెండర్ తప్ప జాబ్‌లు కనిపించడం లేదని అన్నారు. ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. ఆరు గ్యారంటీలకు రేవంత్ సర్కార్ మంగళం పడిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలపై అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టం చేశారు.

# ఖతార్ నుంచి గ్యాస్‌తో వచ్చిన నౌక

## ముంద్రా పోర్టుకు చేరుకున్న శివాలిక్

## భారత్‌కు దక్కనున్న భారీ ఊరట

**న్యూఢిల్లీ, మార్చి 16 (ప్రభాత ఉదయం)**

మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ భారత్‌కు ఊరటనిచ్చే వార్త అందింది. ఖతార్ నుండి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన భారీ ట్యాంకర్ 'శివాలిక్', సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరాన్, అమెరికా మధ్య ఘర్షణల కారణంగా ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూసివేత ముప్పు పొంచి ఉంది. ఇరాన్ ఈ మార్గాన్ని అడ్డుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో, గల్ఫ్ దేశాల నుండి భారత్‌కు చమురు, గ్యాస్ సరఫరా నిలిచిపోతుందేమోనన్న ఆందోళన నెలకొంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో 'శివాలిక్' నౌక సురక్షితంగా ప్రయాణించి లక్ష్యాన్ని చేరుకోవడం భారత ఇంధన భద్రతకు సానుకూల సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. శివాలిక్ ఎల్‌పిజి ట్యాంకర్ ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ నుండి వేల టన్నుల ఎల్‌పీజీని మోసుకొచ్చింది. ఉద్రిక్తతల దృష్ట్యా భారత నావికాదళం గల్ఫ్ ప్రాంతంలో నిఘాను పెంచిన సంగతి తెలిసిందే. భారతీయ నౌకల ప్రయాణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ



భద్రతాపరమైన భరోసా కల్పిస్తోంది. గుజరాత్‌లోని అదానీ ముంద్రా పోర్టులో ఈ గ్యాస్ అన్-లోడింగ్ పక్రియ ప్రారంభమైంది. ఇది దేశీయ గ్యాస్ అవసరాలకు ఎంతో కీలకం. ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే చమురులో సుమారు 20 శాతం ఈ జలసంధి ద్వారానే సాగుతుంది. ఇరాన్-అమెరికా యుద్ధం వల్ల ఈ మార్గం మూసుకుపోతే అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ షిప్పింగ్ కంపెనీలు ఈ మార్గంలో ప్రయాణాన్ని నిలిపివేయగా, భారత్ మాత్రం తన వ్యూహాత్మక సంబంధాల ద్వారా సరఫరాను కొనసాగిస్తోంది.

# హార్మూజ్ జలసంధి వద్దకు యుద్ధనౌకలు

## ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించిన ఆస్ట్రేలియా... సంయమనం పాటించాలన్న జపాన్

**న్యూఢిల్లీ, మార్చి 16 (ప్రభాత ఉదయం)**

హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను మిత్ర దేశాలు తిరస్కరించాయి. ప్రస్తుతానికి తమకు ఆ ఆలోచన లేదని తేల్చి చెప్పాయి. ట్రంప్ అభ్యర్థనను ఆస్ట్రేలియా తోసి పుచ్చింది. తాము యుద్ధ నౌకలను పంపబోమని స్పష్టం చేసింది. 'ఆ జలసంధి ఎంత కీలకమో మాకు తెలుసు. కానీ అక్కడకు మేము యుద్ధ నౌకలను పంపబోము. అసలు యుద్ధ నౌకల కోసం మమ్మల్ని ఎవరూ సంప్రదించలేదు. మేము ఈ విషయంలో జోక్యం చేసుకోలేదు' అని ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ చెప్పారు. ట్రంప్ అభ్యర్థనపై జపాన్ ఆచితూచి స్పందించింది. ఈ విషయంలో సంయమనం అవసరమని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో తాము మేరిటైమ్ చర్యల గురించి ఆలోచించట్లేదని పేర్కొంది. ఇతర ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించినట్టు తెలిపింది. అమెరికాతో మరిన్ని చర్చల తరువాత ఈ విషయంలో ఒక నిర్ణయానికి వస్తామని దక్షిణ కొరియా పేర్కొంది. సమగ్ర సమీక్ష తరువాత ఈ విషయంలో ముందడుగు వేస్తామని వెల్లడించింది.బ్రిటన్ కూడా ఈ విషయమై ఆచితూచి స్పందించింది. యుద్ధ నౌకలను పంపించే విషయంలో ట్రంప్‌తో చర్చిస్తున్నామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీతో కూడా చర్చించినట్టు తెలిపారు. సోమవారం జరగనున్న సమావేశంలో మరోసారి ఈ విషయమై చర్చిస్తామని అన్నారు.హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపించాలని పలు దేశాలను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం అభ్యర్థించిన విషయం తెలిసిందే. తమ పరిధిలోని ప్రాంతాన్ని ఆయా దేశాలు రక్షించుకోవాలని అన్నారు. ఇంధన అవసరాల కోసం హోర్ముజ్ జలసంధిపై అమెరికా అంతగా



ఆధారపడలేదని అన్నారు. ఇతర దేశాలకే ఆ అవసరం ఎక్కువని కామెంట్ చేశారు. ఈ సందర్భంగా చైనా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. చైనా దిగుమతుల్లో అధిక శాతం హోర్ముజ్ మీదుగానే వెళుతున్నాయని అన్నారు. అయితే, హోర్ముజ్ జలసంధిని తెరిపించే ప్రయత్నాల్లో చైనా భాగం అవుతుందా? లేదా? అనే విషయంపై ఆయన స్పందించేందుకు నిరాకరించారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

## ఉమ్మడి పాలమూరు జిల్లా సిడిసి మాజీ చైర్మన్ భీసం చెన్నకేశవరెడ్డి

**కొత్తకోట, మార్చి 16(ప్రభాత ఉదయం )**

అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఉమ్మడి పాలమూరు జిల్లా సిడిసి మాజీ చైర్మన్ భీసం చెన్నకేశవరెడ్డి అన్నారు. సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కొత్తకోట పట్టణ కేంద్రంలోని వారి విగ్రహానికి పూలమాల వేసి ఉమ్మడి పాలమూరు జిల్లా సిడిసి మాజీ చైర్మన్ భీసం చెన్నకేశవరెడ్డి నివాళులర్పించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మంచి రాజకీయ నాయకులు స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్రా ప్రత్యేక రాష్ట్రం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు.మద్రాసు రాజధానిగా వుండే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు మద్రాసులో 1952 అక్టోబర్ 19న బులుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహారదీక్ష ప్రారంభించాడని గుర్తు చేశారు. చాలా మామూలుగా ప్రారంభమైన దీక్ష, క్రమంగా ప్రజల్లో అలజడి రేపింది. ఆంధ్ర కాంగ్రెసు కమిటీ మాత్రం దీక్షను సమర్థించలేదు. ప్రజలు మాత్రం శ్రీరాములుకు మద్దతుగా సమ్మెలు, ప్రదర్శనలు జరిపారు. ప్రభుత్వం మాత్రం రాష్ట్రం ఏర్పాటు దిశగా విస్పష్ట ప్రకటన చెయ్యలేదు.రోజురోజుకూ ఆరోగ్యం క్షీణస్తూ ఉన్నా, శ్రీరాములులో మనోధైర్యం మాత్రం మరింత పెరుగుతుండేది. తన ఆరోగ్యానికి ఏమీ ఢోకాలేదని ఆయన ఉత్తరాల్లో పదే పదే చెప్పేవారు. నవంబరు 27వ తేదీ నాటికి శ్రీరాములు ఇంట్లోనే కొద్దికొద్దిగా తిరుగుతూ అవసరాన్ని బట్టి మాట్లాడుతుండేవాడు. ఆ తర్వాత అతని ఆరోగ్యం క్రమంగా క్షీణించసాగింది. వార్తా పత్రికల్లో ఆయన ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తమయ్యేది. డాకర్లు వచ్చి రక్త పరీక్షలు కూడా చేశారు. నిద్రపోయే సమయంలో తప్పితే ఆయనకు ఎల్లప్పుడూ నోట్లో లాలాజలం కారుతుండేది. నిమిష నిమిషానికి చొంగ కారుతుండేది. తరచూ వాంతులు అయ్యేవి. ఎక్కిళ్ళు, తుమ్ములు వచ్చేవి. అప్పటికే ఆయన అలసిపోవడం... పైగా వాంతులు, తుమ్ములతో మరింత



అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కష్టంగా ఉండేది. డిసెంబరు 5వ తేదీనాటికి ఎక్కిళ్లు, తుమ్ములు తగ్గినా శీతవిరోచనాలు మొదలయ్యాయి. దాంతో మరింత నీరసించారు. శిబిరంలోని అందరూ గాబరాపడ్డారు. నిరాహారదీక్షకు కూర్చునేముందే ఆయన రోజుకు మూడుసార్లు నీటిలో నిమ్మకాయరసం, కొంచెం తేనె కలిపి తీసుకుంటానని ప్రకటించారు. ఇప్పుడు అవి కూడా వాంతులు అయిపోయేవి. కొన్నికొన్ని సందర్భాల్లో నెత్తురు పడ్డది. ఇక ఆత్మార్పణ వారం రోజులు ఉందనగా శ్రీరాములు పూర్తిగా లేవలేని, మాట్లాడలేని స్థితికి వచ్చారు. డిసెంబరు నెల కావడంతో విపరీతంగా చలి. దాంతో, ఆయన వణుకుతుంటే ఎప్పుడూ చొక్కా వేసుకోని శ్రీరాములుకు చొక్కా తొడిగారు. ఆయన బాగా నీరసించిపోవడంతో గ్లూకోజ్ ఇవ్వాలని డాకర్లు చెప్పారు. అప్పటికే మాట్లాడలని స్థితిలో ఉన్న శ్రీరాములు వద్దని చేయి ఊపుతూ సూచించారు. ఉద్యమం ఉధృతం కావడం. ప్రభుత్వం లిస్పందించకపోవడం; ఆయన రోజురోజుకూ నీరసం కావడంతో ఓరోజు బులుసు సాంబమూర్తి, నరసింహలతో మాట్లాడారు. క్రమక్రమంగా దేహం బలహీనం అయ్యి, స్పృహ తప్పి పోయినా దీక్ష నిర్విఘ్నంగా కొనసాగాలని కోరుకొన్నారు. స్పృహ లేనప్పుడు ఎవరూ బలవంతంగా ఇంజెక్షను ద్వారా ఆహారం ఎక్కించరాదని ఆయన చెప్పారు. అప్పటికే రాష్ట్రంలో జరుగుతున్న అల్లరును ఆయన వ్యతిరేకించారు.ఆఖరు రోజు డిసెంబర్ 15 శ్రీరాములు ఆత్మార్పణ రోజు!!ఉదయం నుంచే ఆయన స్పృహలో లేరు. కళ్లు తెరిచారు. అంతలోనే మూతలు పడపోయేవి. చేతులు కదిపేందుకు కూడా శక్తి లేదు. 15.8 కేజీలు బరువు తగ్గారు. నాడి కదలిక, శ్వాసతీరుల్లో మార్పు వచ్చింది. 16 గంటలపాటు మూత్రం స్తంభించింది. నోటిమాట కష్టమైంది. అప్పుడప్పుడు అపస్మారకంలోకి వెళ్లేవారు. సందర్శకులను నిలిపివేశారు.సాయంత్రం వచ్చిన ప్రకృతి చికిత్సకులు వేగిరాజు కృష్ణమరాజు, ఆయన సతీమణులతో మాట్లాడలేకపోయినా... చిరునవ్వుతో స్వాగతం పలికారు. అప్పటి నుంచి క్రమంగా శరీరం చల్లబడిపోయింది.రాత్రి 11.23 గంటలకు పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్రం కోసం తనను తాను బలిదానం చేసుకున్నారు. అని ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 16(ప్రభాత ఉదయం):**

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫెరెన్స్ హాల్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా... జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆర్జీదారుల సమస్యల గురించి తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా (224) ఆర్జీలను కలెక్టర్ స్వీకరించారు.ప్రజావాణిలో ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన వివిధ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదే విధంగా వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

**ఇందులో కొన్ని దరఖాస్తులు ఇలా ఉన్నాయి..**

పాలకుర్తి మండలం, విస్నూర్ గ్రామానికి చెందిన బి. వసంత, గత 12 సంవత్సరాలుగా జగిత్యాల జిల్లా పొలాస గ్రామంలో జీవనం సాగిస్తున్నారని, గుంట పావు భూమి కూడా ఇక్కడే కలదని, అయితే ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇల్లు కోసం జనగామ జిల్లా పరిధిలో దరఖాస్తు చేసినారని, కావున తన ప్రజాపాలన దరఖాస్తును జనగామ జిల్లా నుంచి జగిత్యాల జిల్లా పొలాస రూరల్ కు బదిలీ చేయాలని విన్నవిస్తూ దరఖాస్తు చేసియున్నారు.

తరిగొప్పుల మండలం, ఎన్యా నాయక్ తండాకు చెందిన ఎం. నిర్మల, తనకు గల ఒక గుంట భూమి పట్టా పాస్ బుక్ లాక్ అయిందని, ఆర్డీఓ లాగిన్ లో ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

లింగాల ఘనపురం మండలం, వడ్డిచర్ల గ్రామానికి చెందిన రమాదేవి, తనకు సొంత ఇల్లు, సొంత స్థలం ఏమీ లేదు అని, అద్దెకు ఉంటున్నాను అని, గతంలో ఇందిరమ్మ ఇల్లు కొరకు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాను అని, తెల్ల ఆహార భద్రత కార్డు కలదని, కావున తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, నివాసం కల్పించగలరని వేడుకుంటూ దరఖాస్తు చేసుకున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

జిల్లా కేంద్రంలోని వీవర్స్ కాలనీ, 12వ వార్డుకు చెందిన పెంట సోమలక్ష్మి, గత ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నారని, తమకు ఎటువంటి ఇల్లు, ఖాళీ స్థలం లేదని, డబుల్ బెడ్ రూం ఇల్లు ఇప్పించుట కోసం ఆర్జీ ద్వారా కోరారు.

జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్ కు చెందిన గౌరోజు సదాశివరావు, హైదరాబాదు రోడ్డులో గల ఏకశిల కళాశాల పక్కన తనకు ప్లాటు కలదని, ఆ ప్లాటు కెనాల్ కాలువలో పోయిందని, ఈ విషయమై తనకు నష్ట పరిహారం ఇప్పించుట గురించి వినతిపత్రం సమర్పించనైనది.

ఈ ప్రజావాణిలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, డీఆర్డీఓ వసంత, డీఏఓ అంబికా సోనీ, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు కొరత లేకుండా విత్తనాలు, ఎరువుల సరఫరా చేయాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ రిజ్వాన్



గాంధీ చౌక్ లోని ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

## వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

## డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రేషన్ పక్కాగా నిర్వహించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 16(ప్రభాత ఉదయం)**

రైతులకు అవసరమైన విత్తనాలు,ఎరువులు కొరత లేకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు.సోమవారం జిల్లా కేంద్రంలోని శివ శంకర్ ఆగ్రో ట్రేడర్స్ ఫర్టిలైజర్స్ షాప్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం వారికి పెద్దపీట వేస్తోందన్నారు. ఎరువుల స్టాక్ వివరాలను ప్రతి రోజూ బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలని, స్టాక్ బోర్డు ప్రకారం కచ్చితంగా నిల్వలు ఉండాలన్నారు. స్టాక్ లెక్కలలో తేడా వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాక్ వివరాలను ఖచ్చితంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలనీ, ఎరువుల ధరలు ప్రభుత్వ నియమాల ప్రకారం ఉండాలన్నారు. అన్ని విక్రయాలు ఈ – పాస్ యంత్రం ద్వారా మాత్రమే జరగాలని, లైసెన్స్ లేకుండా ఎరువుల అమ్మకాలు జరగకూడదని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తరచూ పెస్టిసైడ్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, రైతులకు ఎరువుల కొరత ఏర్పడకుండా క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ బస్తీ దవాఖానాను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇక్కడ నిల్వచేసిన మందులు, వైద్య సామగ్రిని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు తరలించాలని ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి లోపల, పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సిబ్బందికి సూచించారు .అంతకుముందు గోనుపాడు శివారులో కలెక్టర్ పొలాలను సందర్శించి పంటల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడారు. డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రేషన్ పకడ్బందీగా చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, మండల వ్యవసాయాధికారి ప్రతాప్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రాంబాగ్ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ను ఆకస్మిక తనిఖీ చేసిన విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్

# రాంబాగ్ ప్రభుత్వ ప్రాధమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్

**బుద్వేల్, మార్చి 16 (ప్రభాత ఉదయం):**

రాంబాగ్ ప్రభుత్వ ప్రాధమిక పాఠశాలను సోమవారం విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆకస్మిక తనిఖీ చేశారు. అదే పాఠశాలలో భూపాల్ నగర్ ప్రాధమిక పాఠశాల కూడా ఉండటంతో రెండు పాఠశాలల పనితీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఆయన నేరుగా మాట్లాడారు. అన్ని తరగతి గదులను తిరిగి విద్యార్థుల ఆభ్యాస స్థాయి లను గమనించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో ఎక్కడైన లోపాలు ఉంటే తక్షణమే సరిచేసుకోవాలన్నారు. విద్యార్థుల అభ్యాస స్థాయిలను 15 రోజులలోపు మెరుగుపరచాలన్నారు. పాఠశాలలో పరిశుభ్రత సరిగ్గా లేదని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సరిగ్గా పనిచేయని సిబ్బందిని తొలగించి కొత్త వారిని నియమించుకోవాలన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. రాంబాగ్ ప్రాధమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి తో పాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులు, 190 మంది విద్యార్థులుండగా, భూపాల్నగర్ ప్రాధమిక పాఠశాలలో అరవింద్ అనే ఉపాధ్యాయునీతో పాటు 30 మంది విద్యార్థులు ఉన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న హిందూ సమ్మేళనం ప్రతినిధులు

# రాజేంద్రనగర్‌లో నిర్వహించనున్న హిందు సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

**బుద్వేల, మార్చి 16 (ప్రభాత ఉదయం)**

హిందువులను ఒక తాటిపైకి తీసుకువచ్చి సనాతన ధర్మం పరిరక్షణ కోసం భవిష్యత్తు తరాలకు ఆధ్యాత్మిక విలువలు అందించేందుకు హిందు సమాజం ముందుకు సాగాలని హిందు సమ్మేళనం రాజేంద్రనగర్ అధ్యక్షులు పెండ్యాల రామక్రిష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షులు బ్రాహ్మణపల్లి బాల్ రాజ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుల్తాన్ అమరేందర్ లు అన్నారు. ఏప్రిల్ 4వ తేదీన రాజేంద్రనగర్ లో నిర్వహించనున్న హిందు సమ్మేళనానికి సంబందించిన వాల్ పోస్టర్ ను సోమవారం వారు రాజేంద్రనగర్ లో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఏప్రిల్ 4వ ఏతీన సాయం త్రం 5 గంటలకు రాజేంద్రనగర్ హరిహర క్షేత్రం మైదానం లో ఈ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుం దన్నారు. పెద్ద సంఖ్యలో హిందువులు ఈ సమ్మేళనంలో పాల్గొని విజయవంతం చేసే విదంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వాల్ పోస్టర్ ను ఆవిష్కరణ సభ లో రాజేంద్రనగర్ హిందు సమ్మేళనం సంయుక్త కోశాధికారి పెంటయ్య, ప్రచార కార్యదర్శి వేముల రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.




రాజేంద్రనగర్ లోని ఐ ఐ ఎం ఆర్

# ఈ నెల 18న గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆఫ్ మిల్లెట్స్ (శ్రీ అన్న 3వ వ్యవస్థాపక దినోత్సవం

**బుద్వేల్, మార్చి 16 (ప్రభాత ఉదయం)**

ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యకరమైన, పౌష్టికాహారాన్ని అందించే విదంగా కృషి చేస్తు అటు రైతులకు, ఇటు ప్రజలకు సేవలందిస్తున్న రాజేంద్రనగర్ లోని గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆఫ్ మిల్లెట్స్ (శ్రీ అన్న ) ఈ నెల 18న రాజేంద్రనగర్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) లో మూడవ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించుకోనుంది. ఈ సందర్భంగా ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి మాట్లాడుతూ, 2023 ను ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరం గా ప్రకటించిన నేపథ్యంలో రాజేంద్రనగర్ లోని ఐఐఎంఆర్ ప్రపంచ గుర్తింపును పొందిందన్నారు. చిరుధాన్యాల పంటలు, ప్రాసెసింగ్ విధానాలు, రైతులను ప్రోత్సహించడం లాంటి కార్య క్రమాలను చూసిన ప్రధానమంత్రి నరేంద్రమోడి ఐఐఎంఆర్ ను గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆప్ మిల్లెట్స్ (శ్రీ అన్న) గా నియమించారన్నారు. చిరుధాన్యాలను అభివృద్ధి చేయడం, చిరుధాన్యాలను పండించే రైతులను ప్రోత్సహించడం. చిరుధాన్యాలతో అనేక ఆహార ఉత్పత్తులను తయారు చేయడం లో ఈ సంస్థ ముందుకు సాగుతుంది. శ్రీ అన్న మూడవ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సంస్థ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ, పరిశోధన కార్యక్రమాలను ప్రపంచానికి వివరించడం జరుగుతుందన్నారు. చిరుధాన్యాల పంటలు, ప్రాసెస్ విధానాలపై పనిచేస్తున్న సంస్థలు, వారి విజయగాధలు ఈ సందర్భంగా ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు.

# గణనపై సంపూర్ణ అవగాహన అవసరం






## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి16(ప్రభాత ఉదయం)**

జనాభా లెక్కల ప్రక్రియలో భాగంగా మొదట ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ఇందుకుగాను గణనపై సంపూర్ణ అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం గద్వాల ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి చార్జ్ అధికారులు, అదనపు చార్జ్ అధికారులకు ఇండ్ల గణనపై మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జన గణన, ఇండ్ల గణన కార్యక్రమంలో భాగంగా 2026 సంవత్సరంలో మొదటి విడతలో ఇండ్ల గణన కార్యక్రమాన్ని పూర్తి డిజిటలైజేషన్ పద్ధతిలో స్మార్ట్ ఫోన్ ద్వారా చేపట్టడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని సేకరించి వివరాలు నమోదుచేసి ఇండ్ల జాబితా రూపొందిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు, చార్జింగ్ అధికారులు నిర్వహిస్తారని, చార్జ్ అధికారులుగా తహసిల్దార్లు, అదనపు చార్జ్ అధికారులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లాలో ఆయా ప్రాంతాల్లో ఉండే జనాభా ఆధారంగా బ్లాక్ లుగా విభజించుకొని గణన చేపట్టాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ఇండ్ల గణన పూర్తయితే 2027 ఫిబ్రవరిలో ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన 33 ప్రశ్నలను అడిగి వివరాలను నమోదు చేస్తారన్నారు. ప్రస్తుతం చేపట్టే గణన ఆధారంగానే భవిష్యత్తులో వివిధ వర్గాలకు ఆయా సందర్భాల్లో రిజర్వేషన్లు నిర్ణయించడం జరుగుతుంది కాబట్టి గణనను పక్కాగా చేపట్టాల్సి ఉ ఒదన్నారు. జిల్లాలో సుమారు 1100 మంది ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు అవసరమవుతారని, ఉపాధ్యాయులకు ఈ విధులు అప్పగించాలన్నారు. ఈ జనాభా గణనను పూర్తిగా డిజిటల్ విధానంలో చేయాల్సి ఉన్నందున 2026-2027 సెన్సెస్ ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. సెన్సెస్ ఇండెక్స్ పుస్తకాన్ని పూర్తిగా చదివి అవగాహన పెంపొందించుకోవాలని, ట్రైనర్లు వివరించే ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిర్వహించి కార్యచరణ ప్రకారం జాబితా రూపొందించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి అంశాన్ని నేర్చుకుంటూ ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే ట్రైనర్స్ ను అడిగి వెంటనే పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డిఓ శ్రీనివాసరావు, సెన్సెస్ ఆపరేషన్ జాయింట్ డైరెక్టర్ లాజర్, సిపిఓ పాపయ్య, ట్రైనర్ సుల్తాన్, సంబంధిత ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సోంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభిస్తున్న ఎస్సీ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ అనిల్ కుమార్ రెడ్డి

## రైతులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం: ఎస్ ఈ శ్రీనివాసరెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి(కేటిదొడ్డి), మార్చి 16(ప్రభాత ఉదయం)**

రైతులకు నాణ్యమైన , లో ఓల్టేజ్ సమస్య లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని విద్యుత్ గద్వాల సర్కిల్ ఎస్ ఇ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం కేటీదొడ్డి మండలంలోని కొత్తగా నిర్మించిన సోంపురం సబ్ స్టేషన్‌ను ఆయన కేటిదొడ్డి ఏఈ కె.అనిల్ కుమార్ రెడ్డి తో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభించారు. అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సోంపురం సబ్ స్టేషన్‌కు సంబంధించిన 11 కేవీ ఫీడర్లను కూడ ఛార్జ్ చేసి రైతులకు విద్యుత్ సరఫరాను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుతో విద్యుత్ సరఫరాలో అంతరాయం , విద్యుత్ కోతలు, లో ఓల్టేజ్ సమస్యలు లేకుండా సోంపురం, సుల్తాన్‌పూర్, ఎర్సన్ దొడ్డి గ్రామాలకు మేలు జరుగుతుందని వెల్లడించారు.ఈ సబ్ స్టేషన్ ప్రారంభం వల్ల గ్రామాల్లో ఉన్న లో వోల్టేజ్ సమస్యలు పూర్తిగా తగ్గిపోతాయని తెలిపారు.




## డిగ్రీ కళాశాలలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవం

**గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి16(ప్రభాత ఉదయం)**

ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని సోమవారం గద్వాలలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్స్, కామర్స్ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులు, యంత్రాంగాల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ మీనాక్షి మాట్లాడుతు...వినియోగదారులు తమ హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే మోసాలకు గురికాకుండా ఉంటారని సూచించారు. వినియోగదారులుగా మనం ఎటువంటి వస్తువులను కొనగోలు చేయాలి, ప్రపంచములో ప్రస్తుతం వినియోగ దారుల - ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమములో అద్యాపకులు పి. సురేష్ బాబు, ఎం. వెంకటేష్, కె.చంద్రశేఖర్, జి. చంద్రశేఖరెడ్డి, బి.జగన్ మోహన్, లక్ష్మీనారాయణ, విద్యార్థినిలు పాల్గొన్నారు.



## విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం నింపిన విద్యా విహారయాత్ర

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 16(ప్రభాత ఉదయం)**

ధరూర్ మండలంలోని జాంపల్లి కొత్తపాలెం తాండ గ్రామాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులను విహారయాత్రకు ఆదివారం తీసుకువెళ్లారు. ప్రధానోపాధ్యాయురాలు పరుమాల రేవతి, ఇందుమతి ఆధ్వర్యంలో ఆదివారం విద్య, వైజ్ఞానిక విహారయాత్రకు వెళ్లారు.ఇందులో భాగంగా పురావస్తు ప్రదర్శనశాల కాలువ బుగ్గ యాగంటి,బెలూమ్ గుహలు, కొండా రెడ్డి బురుజు తదితర ప్రదేశాలను సందర్శించారు. విద్యార్థులు సంతోషంగా ప్రదేశాలను తిలకించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆధ్యాత్మికత, ప్రకృతి అందాలను ఆస్వాదించా లన్న ఉద్దేశంతో చేపట్టిన ఈకార్యక్రమం విద్యార్థుల్లో ఆనందాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రాంబాగ్‌లో హైడ్రా స్వాధీనం చేసుకున్న స్థలం విద్యాశాఖకు కేటాయించనున్నారా.. ?

**బుద్వేల్, మార్చి 16 (ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ రాంబాగ్ లో ఆదివారం హైడ్రా స్వాధీనం చేసుకున్న 6,444 గజాల ప్రభుత్వ స్థలాన్ని విద్యాశాఖ కు అప్పగించే ఆలోచన లో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తుంది. సోమవారం తెలంగాణ రాష్ట్ర విద్యాశాక డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆ స్థలాన్ని సందర్శించారు. ఆయన వెంట తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్టర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఐఐసీ) కి చెందిన ఇంజనీర్లు కూడా ఉన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆ స్థలం అనుకూలంగా ఉ ఒటుందా.. లేదా చూడాలని విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ కు సూచించడంతో ఆయన వచ్చి చూసి వెళ్లారు.



హామీలు అమలు చేయాలని వినతి అందజేసిన బిజెపి నాయకులు

## కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### మండల బిజెపి అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి

**కేటి దొడ్డి, మార్చి 16(ప్రభాత ఉదయం)**

ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ఆదేశాల మేరకు మరియు రాష్ట్ర బిజెపి పార్టీ ఆదేశాల మేరకు సోమవారం బీజేపీ పార్టీ కేటిదొడ్డి మండలాధ్యక్షుడు శ్రీపాదరెడ్డి ఆధ్వర్యంలో నాయకులుర్యాలీగా తరలివెళ్లి డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాని తాసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ అశోక్ కుమార్ కు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం హామీలు తక్షణమే అమలు చేయాలనీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇవ్వడం జరిగిందని, కానీ వాటిలో ఏ ఒక్క హామీ కూడా ఇప్పటివరకు పూర్తిగా అమలు కాలేదు అని ఆరోపించారు. ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, పెన్షన్స్ , కల్యాణ లక్ష్మి ,పేదల గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలు అమలు పరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ప్రజలు దరఖాస్తులు సమర్పించినప్పటికీ వారి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు అని, ఆ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. నివాస ఆదాయం మరియు కుల ధ్రువీకరణ పత్రాల జారీలు తీవ్ర జాప్యం జరుగుతోంది ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి అర్హులు నష్టపోకుండా చూడాలి అని కోరారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి మండల పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు అనూషమ్మ అనిమిరెడ్డి , ఓబిసి మండల అధ్యక్షుడు ముంగిలి వీరేష్, బిజెపి నాయకులు నాగిరెడ్డి. అంపయ్య, కొండయ్య జమ్మన్న, గోపాల్, తదితరులు పాల్గొన్నారు



కట్టెల పొయ్యితో వంట చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ నర్మద

## పెంచిన వంట గ్యాస్ ధరల్ని తగ్గించాలి

### ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ నర్మద ప్రజలను ఆదుకోవాలి- అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 16(ప్రభాత ఉదయం)**

పెంచిన పంట గ్యాస్ ధరలను తగ్గించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ నర్మద కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గద్వాల జిల్లా కేంద్రం లో పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి ఏ నర్మద మాట్లాడుతూ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మోడీ మహిళలకు మర్చిపోలేని గొప్ప బహుమతిని ఇచ్చాడన్నారు అమెరికా ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ పై దాడులు చేసిన నోరు విప్పని ప్రధానమంత్రి మోడీ దేశాల మధ్య యుద్ధాలు జరిగిన మన దేశానికి ఇబ్బంది లేదని చమురు నిల్వలు ఉన్నాయని భారతీయులు ఆందోళన చెందొద్దని గొప్పలు పలికిన రెండు రోజులు గడవక ముందే మహిళా దినోత్సవం రోజు మహిళలకు కానుకగా వంట గ్యాస్ సిలిండర్ ధర పెంచారు. మహిళలలు మహారాణులు అంటూ ఆకాశానికి ఎత్తేస్తూ మహిళల నెత్తిన సిలిండర్ బండతో బాధేస్తున్నారు.ఇప్పటికే సిలిండర్ ధర 950 రూపాయలు పెట్టి కొనలేక పేద మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు గ్యాస్ సబ్సిడీ ఇస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నారు, కానీ ఇంతవరకు కూడా సబ్సిడీ బ్యాంకులో ప్రభుత్వం వేయలేదన్నారు. అది అలా ఉండగా మళ్లీ సిలిండర్ పై 60 రూపాయలు 115 రూపాయలు పెంచి పేద మధ్యతరగతి ప్రజలపై అధిక భారాలు మోపింద నీ నిత్యవసర సరుకుల ధరలు పెరిగి పనులు లేక సరుకులు కొనలేక అర్థాకలితో ప్రజలు అవస్థలు పడుతుంటే బిజెపి ప్రభుత్వం మోడీ పెనం మీద నుండి పోయిలో కి నెట్టి వేసిందన్నారు.నిత్యాసర సరుకులు తగ్గించాలని ఆందోళన చేస్తుంటే మోడీ ప్రభుత్వం పొయ్యి కింద మంటలు పెట్టి మహిళలపై భారాలు మోపింది వెంటనే పెంచిన వంట గ్యాస్ ధరల్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిచో బిజెపి ప్రభుత్వానికి మహిళలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అపర్ణ , సరస్వతి, బిసమ్మ, మమత, విజయలక్ష్మి, సౌమ్య, రేణుక, సునీత , తదితరులు పాల్గొన్నారు

# జిల్లా కలెక్టర్ గారు పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించండి

### ప్రజాపాలనలో లోపించిన పారిశుద్యం


**గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి16(ప్రభాత ఉదయం)**

ఓ వైపు కాంగ్రెస్ సర్కారు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుండగా.. మరోవైపు జిల్లాలోని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో అధ్వానంగా తయారైంది. పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, ఫొటోలకు ఫోజులివ్వడం తప్ప చేసిందేమీలేదు. పేరుకు మాత్రం స్వచ్ఛ గద్వాల్ గా చెబుతున్నా నిర్వహణలో మాత్రం శూన్యం చూపిస్తున్నారు గద్వాల మున్సిపాలిటి అధికారులు. గద్వాల మున్సిపాలిటి పరిధిలో పలు వార్డులలో ఎక్కడపడితే అక్కడ చెత్త, చెదారం దర్శనమిస్తున్నాయి. ప్రజలలో అవగాహన కొరవడంతోపాటు అధికారుల నిర్లక్ష్యంతో రోడ్ల పైన చెత్త



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ముందు పేరుకపోయిన చెత్త

దర్శనమిస్తున్నది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాలి దుమారంతో చెత్తాచెదారం రోడ్లపైకి వచ్చి చేరుతున్నడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై పారేసిన చెత్తతో దుర్గంధం వెదజల్లుతుండటంతో ముక్కు మూసుకొని వెళ్లవలసిన పరిస్థితి నెలకొంటుందని ప్రజలు వాపోతున్నారు.



ఆరో వార్డులో దాణా ఫ్యాక్టరీవద్ద పేరుకపోయిన చెత్త చెదారం.

అధికారులు సరైన రీతిలో పర్యవేక్షణ లేకపోవడంతో పాటు ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించడంలో విఫలమయ్యారని విమర్శలున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పరిశుద్ధాన్ని సక్రమంగా నిర్వహించే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.



## నర్మెట్ట బాలికల గురుకుల హాస్టల్ ను సందర్శించిన పేరెంట్స్ కమిటీ

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 16(ప్రభాత ఉదయం):**

జిల్లా లోని యశ్వంతపూర్ లో నడుస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బాలికల (నర్మెట్ట) హాస్టల్ ను సోమవారం తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ జనగామ జిల్లా అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి ఆడెపు రామ్ మల్లయ్య సందర్శించారు. ఈసందర్బంగా విద్యార్థులకు అందుతున్న వసతులను అడిగి తెలుకున్నారు. హాస్టల్ లో వంట గదిని, కూరగాయలను పరిశీలించి, బగున్నాయని, మరింత ఉన్నతంగా సేవలను అందించాలని పేరెంట్స్ ప్రతినిధులు ప్రిన్సిపాల్ ను కోరారు.

# మెరుగైన వైద్యం అందాలి



విద్యార్థులకు పాఠాలు చెపుతున్న జిల్లా కలెక్టర్



పీహెచ్ సి ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

### పరిసరాలు పరిశుభ్రం గా ఉండాలి

### మెనూ ప్రకారమే భోజనం

### పదవ తరగతి విద్యార్థులకు మాథ్స్ భోధించిన కలెక్టర్

### విద్యార్థులు కష్ట పడి చదవాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 16(ప్రభాత ఉదయం):**

జిల్లా లోని నర్మేట్ట మండల కేంద్రంలో పీహెచ్సి, కేజీబీవీ ని సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్. పీహెచ్సి పరిసరాలను ముందుగా పరిశీలించి పలు సూచనలిచ్చారు. మందుల నిల్వ లను అలాగే వాటి మీద ఉన్న ఎక్స్పైరీ డేట్ ని పరిశీలించారు వైద్యానికి సరిపడా మందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సరిపడ మందులను, వ్యాక్సిన్ లను అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు.అనంతరం కెజిబివి ని సందర్శించి...చుట్టూ పరిసరాలలో పెరిగే...పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు.నాణ్యముగా ఉన్నాయా లేదా అని వంటకు సరకులను, పప్పు దినుసులను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజన తయారీ ని కూడా క్షుణ్ణం గా చూసి జాగ్రత్త గా చేయాలనీ, ఎప్పటికప్పుడు వంట చేసే ప్రాంతం పరిశుభ్రం గా ఉండాలని, మెనూ ను తప్పకుండ పాటించాలని కలెక్టర్ తెలిపారు.పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న 10వ తరగతి విద్యార్థులకు మాథ్స్ సబ్జెక్ట్ లోని పలు అంశాలను కలెక్టర్ స్వయం గా నేర్పించి... వాటి మీద విద్యార్థులకు ఉన్న సామర్థ్యన్ని కూడ పరిశీంచారు.



జలమండలి జిఎం కు వినతిపత్రం సమర్పిస్తున్న అంజనేయులు సాగర్ తోపాటు బస్తీ వాసులు.

## రాజీవ్ నగర్ దాహార్తిపై ఆంజనేయులు గళం

### బూస్టర్ మోటార్ ఏర్పాటుకు అధికారులు హామీ

**శేరిలింగంపల్లి : మార్చి 16, (ప్రభాత ఉదయం)**

మాదాపూర్ సర్కిల్ పరిధిలో అంజయ్య నగర్ డివిజన్ లోని రాజీవ్ నగర్ బస్తీలో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై స్థానిక నాయకుడు ఆంజనేయులు సాగర్ వాటర్ వర్క్స్ అధికారుల దృష్టి తీసుకొని వెళ్ళారు. వేసవి తీవ్రత దృష్ట్యా గొంతు ఎండిపోతున్న బస్తీ వాసుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ జలమండలి జనరల్ మేనేజర్ హరి శంకర్ కి వినతి పత్రం సమర్పించారు. భౌగోళిక పరిస్థితులు దృశ్య రాజీవ్ నగర్ బస్తీలోని ఎత్తైన ప్రదేశంలో ఉండడం వల్ల సాధారణ పైప్‌లైన్ ఒత్తిడితో నీరు పైకి చేరడం లేదు. ఏటా వేసవి కాలం ప్రారంభం కాగానే ఇక్కడి నివాసితులకు నీటి కష్టాలు మొదలవుతాయని వివరించారు. ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో కనీసం తాగడానికి కూడా నీరు దొరకక మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం నీటి సరఫరా కూడా తక్కువ ప్రెషర్‌తో వస్తుండడంతో ఎత్తైన ప్రాంతాల్లోని ఇళ్లకు చుక్క నీరు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులతో జరిగిన భేటీలో ఆయన ప్రధానంగా మూడు డిమాండ్లను అధికారుల ముందు ఉంచారు. ఎత్తైన ప్రాంతాలకు నీటిని పంపింగ్ చేసేందుకు ప్రత్యేకంగా బూస్టర్ మోటార్‌ను వెంటనే మంజూరు చేయాలి. ప్రస్తుతమున్న పైప్‌లైన్ ని మార్చాలని. శాశ్వత పనులు పూర్తయ్యే వరకు బస్తీ ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించాలి కోరారు. ప్రజల కనీస అవసరమైన తాగునీటి విషయంలో జాప్యం చేయడం వలన వేసవి కాలంలో నీటి సరఫరా నిలిచిపోవడం వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆంజనేయులు సాగర్ వివరించారు. జీఎం హరి శంకర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాజీవ్ నగర్ సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. త్వరలో అధికారుల బృందాన్ని పంపి సర్వే చేయించి, బూస్టర్ మోటార్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఆంజనేయులు సాగర్ తోపాటు స్థానిక నాయకులు చిన్న సాగర్, నరసింహా, వెంకటేష్, రోహిత్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సిపిఐ నాయకులు

## ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపాలి

### ప్రపంచం యుద్ధం వద్దు శాంతి ముద్దు. అమెరికా, ఇజ్రాయిల్ కు హితావు

### సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రావుల సదానందం

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 16(ప్రభాత ఉదయం):**

ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని సోమవారం జిల్లా లోని లింగాల గణపురం మండలం, నెల్లుట్ల గ్రామం లో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రావుల సదానందం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి సదానందం మాట్లాడుతూ ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని బేషరతుగా ఆపాలన్నారు. యుద్ధం వలన దేశం లో గ్యాస్ నిల్వలు తగ్గి పోయి, ధరలు పెరిగిపోయాయని, ఈ యుద్ధం వలన దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా గృహ అవసరాలకు, హోటల్లో అవసరాలకు గ్యాస్ ధరలు పెరగడం వలన ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాగే యుద్ధం జరిగితే పెట్రోల్ డీజిల్ ధరలు కూడా పెరగవచ్చునని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించి తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రపంచం యుద్ధం వద్దు శాంతి ముద్దు అని అమెరికా, ఇజ్రాయిల్ కు హితావు పలికారు. ఈ కార్యక్రమంలో పేరబోయిన వీరస్వామి, బర్ల అంజయ్య, బండి శ్రీశైలం, కాసర్ల శ్రీను, చిట్టూరి రవి, మొటిక శ్రీను, చిటూరు ఎల్లయ్య, కాసర్ల సత్తయ్య, పి.వెంకన్న, ఎన్.మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ముంద్రా పోర్టుకు చేరుకున్న శివాలిక్

### ఖతార్ నుంచి గ్యాస్‌తో వచ్చిన నౌక

### భారత్‌కు దక్కనున్న భారీ ఊరట

**ముంద్రా, మార్చి 16 (ప్రభాత ఉదయం):**

మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ భారత్‌కు ఊరటనిచ్చే వార్త అందింది. ఖతార్ నుండి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన భారీ ట్యాంకర్ 'శివాలిక్', సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరాన్, అమెరికా మధ్య ఘర్షణల కారణంగా ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూసివేత ముప్పు పొంచి ఉంది. ఇరాన్ ఈ మార్గాన్ని అడ్డుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో, గల్ఫ్ దేశాల నుండి భారత్‌కు చమురు, గ్యాస్ సరఫరా నిలిచిపోతుందేమోనన్న ఆందోళన నెలకొంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో 'శివాలిక్' నౌక సురక్షితంగా ప్రయాణించి లక్ష్యాన్ని చేరుకోవడం భారత ఇంధన భద్రతకు సానుకూల సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. శివాలిక్ ఎల్‌పిజి ట్యాంకర్ ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ నుండి వేల టన్నుల ఎల్‌పీజీని మోసుకొచ్చింది. ఉద్రిక్తతల దృష్ట్యా భారత నావికాదళం గల్ఫ్ ప్రాంతంలో నిఘాను పెంచిన సంగతి తెలిసిందే. భారతీయ నౌకల ప్రయాణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతాపరమైన భరోసా కల్పిస్తోంది. గుజరాత్‌లోని అదానీ ముంద్రా పోర్టులో ఈ గ్యాస్ అన్-లోడింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇది దేశీయ గ్యాస్ అవసరాలకు ఎంతో కీలకం. ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే చమురులో సుమారు 20 శాతం ఈ జలసంధి ద్వారానే సాగుతుంది. ఇరాన్-అమెరికా యుద్ధం వల్ల ఈ మార్గం మూసుకుపోతే అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ షిప్పింగ్ కంపెనీలు ఈ మార్గంలో ప్రయాణాన్ని నిలిపివేయగా, భారత్ మాత్రం తన వ్యూహాత్మక సంబంధాల ద్వారా సరఫరాను కొనసాగిస్తోంది.



ఉచిత పశువైద్య శిబిరం ను ప్రారంభించిన సర్పంచ్

## నెల్లుట్లలో ఉచిత పశు వైద్య, గాలి కుంటా వ్యాధి నిరోధక టీకాలు శిబిరం

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 16(ప్రభాత ఉదయం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా లోని లింఘాల ఘనపూర్ మండలం, నెల్లుట్ల గ్రామంలో సోమవారం ఉచిత పశు వైద్య, గాలి కుంటా వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాన్ని సర్పంచ్ నర్సింగ రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ పశుసంవర్ధక రంగంలో రైతులకు ముఖ్యమైన ఆదాయ వనరుగా మారిందని తెలిపారు. వ్యవసాయంతో పాటు పశుపోషణను కూడా అభివృద్ధి చేసుకుంటే రైతులు ఆర్థికంగా బలోపేతమయితారన్నారు. పశువులకు గాలి కుంటా వంటి అంటూ వ్యాధులు సోకితే తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా జాగ్రత్తగా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, దీనిని పాడి రైతులందరు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్, పశు వైద్యాధికారి అనిత, కాంగ్రెస్ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి దామెర నాగరాజ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తిని అశోక్ కుమార్ గౌడ్, వార్డ్ మెంబర్స్ గొరిగే సందీప్, నల్ల అజయ్, వంగ సతీష్, గొరిగే సాయిలు, కొమ్మరాజుల రేణుక కొముర్రయ్య, బొజ్జం సునీత ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ కుర్రేముల రమేష్, జీడికల్ దేవస్థానం డైరెక్టర్ తుపాకుల వెంకటేష్, జెగ్గం ఆనంద్, శివార్రతి ఎల్లయ్య, పెరబోయిన యాదయ్య, దామెర నవీన్, తదితరులు పాలొగొన్నారు.



## రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన నీలం మధురాజ్, గుండ్ల మహేందర్ రెడ్డి

**పటాన్ చెరు, మార్చి 16 (ప్రభాత ఉదయం):**

తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ముఖ్యమంత్రి రాజకీయ సలహాదారు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వేం. నరేందర్ రెడ్డిని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ తో పాటు బొల్లారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి సోమవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.నమ్మిన సిద్ధాంతం కోసం కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుందని మరోసారి నిరూపితమైందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ కౌన్సిలర్ సంగనగారి గోపాల్ పాల్గొన్నారు.




## వంద శాతం ప్రతి ఇంటా చెత్త సేకరణ జరగాలి

### శానిటేషన్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్

**పటాన్ చెరు, మార్చి 16 (ప్రభాత ఉదయం):**

బొల్లారం డివిజన్ పరిధిలోని ప్రతి ఇంటా వందశాతం చెత్తను సేకరించాలని బొల్లారం డివిజన్ 272 శానిటేషన్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. సోమవారం అమీన్ పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యం లో బొల్లారం డివిజన్ ఆఫీసు లో ఆర్ పి లు, స్వచ్ఛ ఆటో డ్రైవర్ లతో సమావేశం నిర్వహించారు. అమీన్ పూర్ డిప్యూటీ కమీషనర్ ప్రదీప్ కుమార్ ఆదేశాల ప్రకారం డివిజన్ పరిధిలో తడి ,పొడి చెత్త వేరు చేసేలా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ పి లు మరియు స్వచ్ఛ ఆటో డ్రైవర్స్ జవాన్ హరీష్ పాల్గొన్నారు.



## మల్లన్న స్వామి ఆశీస్సులు అందరిపైనా ఉండాలి: సిజిఆర్

### జిన్నారం మున్సిపల్ పరిధిలోని పెద్దమ్మ గూడెం మల్లన్న జాతరలో పాల్గొన్న సిజిఆర్

**పటాన్ చెరు, మార్చి 16 (ప్రభాత ఉదయం):**

మల్లన్న స్వామి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ప్రార్థించినట్లు బిఆర్ఎస్ సీనియర్ నేత చిమ్ముల గోవర్ధన్ రెడ్డి చెప్పారు.జిన్నారం మున్సిపల్ పరిధిలోని పెద్దమ్మ గూడెం గ్రామంలో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవంలో సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డిని 5వార్డ్ కౌన్సిలర్ శిల్ప నాగరాజ్ యాదవ్ ఆహ్వానం పలికి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మల్లన్న స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు చెప్పారు. జాతర సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు రాజేష్,నాగరాజు యాదవ్,బోజి రెడ్డి, సత్యనారాయణ సదానంద రెడ్డి,శ్రీధర్ గౌడ్, సూర్యనారాయణ, జయపాల్ రెడ్డి,మంద రమేష్, శ్రీనివాస్ గౌడ్, స్థానిక నాయకులు, యాదవ్ సంగం సభ్యులు గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# మేకగూడ గ్రామ దత్తత కార్యక్రమ ప్రారంభోత్సవం

**షాద్ నగర్, మార్చి 16(ప్రభాత ఉదయం)**



పి.వి. నరససింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో మేకగూడ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. సోమవారం గ్రామ దత్తత కార్యక్రమ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనితో పాటుగా భారత వ్యవసాయ పరిశోధనా మండలి, ఏఐఎన్పి, సి ఇ డి ఎ-ఎస్ సి ఎస్ పి, పశుసంవర్ధక శాఖ, తెలంగాణ ప్రభుత్వం , నాట్కో ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో మేకగూడ, సంఘీగూడ, పిట్టలగూడ గ్రామాలలో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంత రైతులలో పశుసంవర్ధక రంగంపై అవగాహన మరియు శాస్త్రీయ పద్ధతుల అవలంబన , విలువ ఆధారిత పదార్థాల తయారీపై అవగాహన ముఖ్య ఉద్దేశంగా ప్రారంభించబడినది. మేకగూడ గ్రామ సర్పంచ్ మారు రాజు నాయక్ అధ్యక్షతన నిర్వహించబడిన ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎం. కిషన్ కుమార్ , విస్తరణ సంచాలకులు, పివిఎన్ఆర్టీవీయు ముఖ్యఅతిథిగా గౌరవ అతిధులుగా డాక్టర్ డి. మాధురి అసోసియేట్ డీన్, పశువైద్య కళాశాల, రాజేంద్రనగర్, డాక్టర్ శ్రీనివాసరావు రంగారెడ్డి జిల్లా పశు వైద్యాధికారి పాల్గొని రైతులకి మినరల్ మిక్చర్ , పశుగ్రాస మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ ఎం. కిషన్ కుమార్ మాట్లాడుతూ... పశుసంవర్ధక రంగం రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని, రైతుల పాల ఉత్పత్తి మంచి స్థాయిలో ఉన్నప్పటికీ సరైన ధర పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగా పాలకు విలువ పెంచే ఉత్పత్తులు తయారు చేసి మంచి ఆదాయం పొందవచ్చని రైతులకు సూచించారు. డాక్టర్ ఎం. మాధురి మాట్లాడుతూ శాస్త్రీయ జ్ఞానాన్ని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లి రైతులకు అందుబాటులో ఉంచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే మేకగూడ గ్రామాన్ని ఒక ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయడానికి విశ్వవిద్యాలయం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. రంగారెడ్డి జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస రావు మాట్లాడుతూ... మేకగూడ గ్రామ ప్రజలు పశుసంవర్ధక రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు కానీ సరియైన పోషణ పద్ధతులు , పశు ఉత్పత్తుల నిర్వహణలో సరియైన అవగాహన లేక ఆశించిన మేరకు లాభాన్ని గడించలేకపోతున్నారు. ఈ దత్తత కార్యక్రమం ద్వారా గ్రామ రైతులకు ఈ సమస్యలకు సంబంధించిన సమాచారం నేరుగా అందించి గ్రామంలో పశుసంవర్ధక సేవలను మెరుగుపరచడానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేకగూడ గ్రామ ఉప సర్పంచ్ ఎడ్ల శ్రీశైలం , నందిగామ గ్రామ సర్పంచ్ కొమ్ము కృష్ణ పాల్గొని మేకగూడ గ్రామాన్ని దత్తత తీసుకోవడం తమకి సంతోషకరమని ఇది వారి గ్రామ రైతుల ఆర్థిక అభివృద్ధి మెరుగుపరచడంలో తోడ్పడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమ సమన్వయకర్తగా ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్. సత్యనారాయణ వ్యవహరిస్తూ ఈ కార్యక్రమం ఒక గొప్ప ఉద్దేశంతో ప్రారంభించినదని దీనికి రైతుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించబడిన ఉచిత పశు వైద్య శిబిరం ద్వారా 158 పశువులకి ఉచిత వైద్య సేవలు అందించడం జరిగినది ఇందులో 93 గర్భకోశ సంబంధిత వ్యాధులు, 65 ఇతర వ్యాధులకు సంబంధించిన చికిత్స అందించారు. డాక్టర్ వంశీ, డాక్టర్ విష్ణువర్ధన్ గౌడ్ ఇతర రంగారెడ్డి జిల్లా పశువైద్యులు , పశువైద్య సహాయకులు ఈ కార్యక్రమానికి తమ సహాయ సహకారాలు అందించారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన విశ్వవిద్యాలయ అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పశు వైద్యులు , విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## బిజెపి జిల్లా నూతన కమిటీ కి నియమితులైన నాయకులను సన్మానం చేసిన రాజేంద్రనగర్ పార్టీ నాయకులు

**రాజేంద్రనగర్, మార్చి16(ప్రభాత ఉదయం)**

భారతీయ జనతా పార్టీ జిల్లా కమిటీ ప్రకటించిన పదవులలో రాజేంద్రనగర్ కు చెందిన నలుగురికి పదవులు దక్కాయి. సోమవారం పదవులు దక్కిన ఎం కొమురయ్య, పి మల్లేష్ యాదవ్, షాబాద్ విజయ్ కుమార్, వెంకటరమణ గుప్తలను అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ లోగల బిజెపి కార్యాలయంలో సన్మానించారు. జిల్లా కమిటీలో అత్తాపూర్ సర్కిల్ కు చెందిన కొమురయ్య వైస్ ప్రెసిడెంట్ గా , రాజేంద్రనగర్ సర్కిల్ కు చెందిన మల్లేష్ యాదవ్ కార్యదర్శిగా, హైదర్గూడా డివిజన్ కు చెందిన విజయ్ కుమార్ కి కార్యాలయం సెక్రటరీగా, కాటేదాన్ డివిజన్ కు చెందిన వెంకటరమణ గుప్తకు ఐటీ సెల్ కన్వీనర్ గా బాధ్యతలు కేటాయించారు. అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బిజెపి నాయకులు మాట్లాడుతూ... రానున్న రోజులు రంగారెడ్డి జిల్లాలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడమే మా కర్తవ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి , సీనియర్ నాయకులు కాడెం సుధాకర్, రాచూరి రాజశేఖర్, నల్లింగి రమేష్, సనివెల్లి జయానంద్ రెడ్డి, నరసింహ , కృష్ణ, రాజు పైల్వాన్, వెంకటరెడ్డి, ఉమ ,జి శశికాంత్ శర్మ, రాము, అమర్ నాథ్ రెడ్డి, అమృత ,విజయ్ స్వామి, లింగం బాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో గృహ అవసరాల కొరకు ఎల్ పి జి గ్యాస్ కొరత లేదు

### జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 16(ప్రభాత ఉదయం)**



అమెరికా- ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలోజిల్లాలో గృహ అవసరాలకు ఎల్పిజి గ్యాస్ కొరత లేదని వినియోగదారులు ఎటువంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో నిల్వలను అందుబాటులో ఉంచినట్లు, ఎల్పిజీ సిలిండర్లు పక్కదారి పట్టకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు, సరైన విధంగా సిలిండర్లు ఉపయోగించేటట్లు చూడడానికి ప్రత్యేక మానిటరింగ్ కమిటీ నియమించినట్లు తెలిపారు. ప్రజలు ఎవరు కూడా ముందస్తు బుకింగ్ లు చేయాల్సిన అవసరం లేదని, వినియోగదారుల అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నట్లు తెలిపారు. బుకింగ్ లు నిలువలపై రోజువారి సమీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకుంటామని, అటువంటివి ఎక్కడైనా సంభవిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. దీని కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఇది జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆధ్వర్యంలో కొనసాగుతుందని 7989868271 నెంబర్ ను సంప్రదించాలని, కంట్రోల్ రూమ్ నందు సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఫిర్యాదుల రిజిస్టర్ నందు నమోదు చేయడం జరుగుతుందని, సంబంధిత గ్యాస్ ఏజెన్సీల ద్వారా సమస్యలను పరిష్కరించి, ఫిర్యాదుదారునికి తగిన సమాధానం ఇవ్వడం జరుగుతుందని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను వినియోగదారులు నమ్మరాదని, ఎలాంటి గందరగోళానికి గురికావద్దని తెలిపారు.


## ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించిన ఆస్ట్రేలియా

### హర్మూజ్ జలసంధి వద్దకు యుద్ధనౌకలు

### సంయమనం పాటించాలన్న జపాన్

**న్యూఢిల్లీ, మార్చి16(ప్రభాత ఉదయం)**

హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను మిత్ర దేశాలు తిరస్కరించాయి. ప్రస్తుతానికి తమకు ఆ ఆలోచన లేదని తేల్చి చెప్పాయి. ట్రంప్ అభ్యర్థనను ఆస్ట్రేలియా తోసి పుచ్చింది. తాము యుద్ధ నౌకలను పంపబోమని స్పష్టం చేసింది. 'ఆ జలసంధి ఎంత కీలకమో మాకు తెలుసు. కానీ అక్కడకు మేము యుద్ధ నౌకలను పంపబోము. అసలు యుద్ధ నౌకల కోసం మమ్మల్ని ఎవరూ సంప్రదించలేదు. మేము ఈ విషయంలో జోక్యం చేసుకోలేదు' అని ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ చెప్పారు. ట్రంప్ అభ్యర్థనపై జపాన్ ఆచితూచి స్పందించింది. ఈ విషయంలో సంయమనం అవసరమని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో తాము మేరిటైమ్ చర్యల గురించి ఆలోచించట్లేదని పేర్కొంది. ఇతర ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించినట్టు తెలిపింది. అమెరికాతో మరిన్ని చర్చల తరువాత ఈ విషయంలో ఒక నిర్ణయానికి వస్తామని దక్షిణ కొరియా పేర్కొంది. సమగ్ర సమీక్ష తరువాత ఈ విషయంలో ముందడుగు వేస్తామని వెల్లడించింది.బ్రిటన్ కూడా ఈ విషయమై ఆచితూచి స్పందించింది. యుద్ధ నౌకలను పంపించే విషయంలో ట్రంప్‌తో చర్చిస్తున్నామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీతో కూడా చర్చించినట్టు తెలిపారు. సోమవారం జరగనున్న సమావేశంలో మరోసారి ఈ విషయమై చర్చిస్తామని అన్నారు.హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపించాలని పలు దేశాలను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం అభ్యర్థించిన విషయం తెలిసిందే. తమ పరిధిలోని ప్రాంతాన్ని ఆయా దేశాలు రక్షించుకోవాలని అన్నారు. ఇంధన అవసరాల కోసం హోర్ముజ్ జలసంధిపై అమెరికా అంతగా ఆధారపడలేదని అన్నారు. ఇతర దేశాలకే ఆ అవసరం ఎక్కువని కామెంట్ చేశారు. ఈ సందర్భంగా చైనా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. చైనా దిగుమతుల్లో అధిక శాతం హోర్ముజ్ మీదుగానే వెళుతున్నాయని అన్నారు. అయితే, హోర్ముజ్ జలసంధిని తెరిపించే ప్రయత్నాల్లో చైనా భాగం అవుతుందా? లేదా? అనే విషయంపై ఆయన స్పందించేందుకు నిరాకరించారు.



ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే అధికారులు పరిష్కరించాలి:కలెక్టర్ నారాయణరెడ్డి

## ప్రజావాణికి 52 ఫిర్యాదులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి16(ప్రభాత ఉదయం)**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వివిధ ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు సమస్యల పరిష్కారం నిమిత్తం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి కచ్చితంగా సమాధానం ఇస్తూ తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (52) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ-- 23, ఇతర శాఖలకు -- 29, మొత్తం 52 దరఖస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## గల్ఫ్ యుద్ధం వేళ చైనా దూకుడు

### తైవాన్ దిశగా యుద్ధనౌకలు, విమానాల మొహరింపు

**తైపీ, మార్చి16(ప్రభాత ఉదయం)**

గల్ఫ్ యుద్ధంతో అంతా అటువైపు దృష్టి పెట్టగా చైనా మరోమారు తైవాన్‌పై దృష్టి సారించింది. గత రెండు వారాలుగా కొంత నిశ్శబ్దంగా ఉన్న చైనా సైన్యం.. మళ్ళీ తైవాన్ సరిహద్దుల్లో తన ప్రాబల్యాన్ని చాటుకోవడం మొదలుపెట్టింది. తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, గత 24 గంటల్లో భారీ సంఖ్యలో , నౌకలు చైనా యుద్ధ విమానాలు తైవాన్ గగనతలంలోకి ప్రవేశించాయి. కాగా, ఫిబ్రవరి 27 నుండి మార్చి 13 వరకు తైవాన్ సరిహద్దుల్లోకి చైనా యుద్ధ విమానాల రాక గణనీయంగా తగ్గింది. సాధారణంగా ప్రతిరోజూ పదుల సంఖ్యలో విమానాలను పంపే చైనా, ఈ 16 రోజుల కాలంలో కేవలం 7 విమానాలను మాత్రమే పంపింది. అయితే, ఈ ఆకస్మిక విరామానికి కారణమేంటో రక్షణ నిపుణులకు సైతం అంతుచిక్కలేదు. కానీ, ఆదివారంనుండి చైనా మళ్ళీ తన దూకుడును పెంచింది. తైవాన్ చుట్టూ సుమారు 26 చైనా సైనిక విమానాలను గుర్తించారు. వీటిలో 16 విమానాలు తైవాన్ నైరుతి ఎయిర్ డిఫెన్స్ ఐడెంటిఫికేషన్ జోన్ లోకి ప్రవేశించాయి. విమానాలతో పాటు 7 చైనా యుద్ధ నౌకలు కూడా తైవాన్ సముద్ర తీరానికి సమీపంలో చక్కర్లు కొడుతున్నాయి. ఫిబ్రవరి 25న 30 విమానాలు వచ్చిన తర్వాత, మళ్ళీ ఈ స్థాయిలో విమానాలు రావడం ఇదే తొలిసారి. ఇలాఉండగా, మార్చి 31న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాలో పర్యటించనున్నారు. ఇక, చైనా విమానాలు లేని సమయంలో కూడా వారి యుద్ధ నౌకలు సముద్రంలోనే ఉన్నాయని తైవాన్ రక్షణ మంత్రి వెల్లింగ్టన్ కూ స్పష్టం చేశారు. చైనా నుండి ముప్పు ఏమాత్రం తగ్గలేదని.. తాము నిరంతరం అప్రమత్తంగానే ఉన్నామని ఆయన పేర్కొన్నారు.



## జల వనితగా తెలగమల్ల ఆనంద

### ఆనందను సన్మానించిన కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి16(ప్రభాత ఉదయం)**

రంగారెడ్డి జిల్లా అమన్ గల్ మండలం చెన్నంపల్లి గ్రామ పంచాయతీకి చెందిన 'జల వనిత' గా తెలగమల్ల ఆనంద, 'జల్ జీవన్ మిషన్' అమలులో ఆమె చేసిన కృషికి గాను ఎంపికయ్యారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 'జల్ మహోత్సవ్ ప్రచార కార్యక్రమం 2026'లో ఆమె పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ ప్రముఖులు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమం కోసం తెలంగాణ రాష్ట్రం నుండి మొత్తం 3 మంది మహిళా సర్పంచులు, 3 మంది 'జల వనితలు' , 3 మంది స్వయం సహాయక బృందాల మహిళలు ఎంపికయ్యారు; ఎంపికైన ఆ ప్రతినిధులలో తెలగమల్ల ఆనంద ఒకరు.జల్ జీవన్ మిషన్ అమలులో ఆమె చేసిన విశేష కృషిని గుర్తించి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సోమవారం కొంగరకలాన్‌లోని ఐ డి ఓ సి లో తెలగమల్ల ఆనందను ఘనంగా సన్మానించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608